
7 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

కామారెడ్డి టౌన్, జనవరి 4: కామారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 67వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు 17ఏళ్ల బాలురకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 7 నుంచి 11 తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. మొట్ట మొదటి సారిగా మన కామారెడ్డి జిల్లాలో జాతీయ స్థాయి కబడ్డీ క్రీడలను రాష్ట్రవిద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు.



చిన్నారి పెళ్లి కూతుళ్లు!

- కట్టుబాట్లు, ఆర్థిక ఇక్కట్లతో బాల్య వివాహాలు
- జిల్లాలో అవగాహన కల్పిస్తున్నా.. మార్పు నామ మాత్రమే
- మారుమూల పల్లెల్లో, తండాల్లో జోరుగా వివాహాలు
- కౌన్సెలింగ్ ఇచ్చినా.. కొందరిలోనే మార్పు

కామారెడ్డి టౌన్, జనవరి 4: బాల్య వివాహాలపై ప్రభుత్వాలు అవగాహన కల్పించినా.. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా ప్రజల్లో పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదు. కట్టుబాట్లనే చాదస్తం వల్ల తల్లిదండ్రులు చేసే అనాలోచిత చర్యల వల్ల చిన్నారుల జీవితాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. ఎక్కువ మొత్తంలో అధికారులకు అందిన సమాచారంతో చిన్నారి పెళ్లి కూతుళ్లకు విముక్తి లభిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అరికట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. పేదరికం, నిరాక్షరాస్యత, కట్టుబాట్లు, సామాజిక రుగ్మతలతో ఆడ పిల్లలను భారంగా భావిస్తున్న కొందరు తల్లిదండ్రులు త్వరగా పెళ్లిళ్లు చేయడానికి మొగ్గు చూపుతుండడంతో చిన్నారుల జీవితాలు ఛిద్రమవుతున్నాయి. ఆయా పాఠశాల్లో, సమావేశాల్లో అటు పోలీసులు, ఇటు అధికారులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతుండడం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తుండడంతో చిన్నారులు పెళ్లిళ్లకు విముఖత చూపుతున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు చిన్నారులకు పెళ్లిలు జరిపించడానికి అనేక అడ్డదారులను వెతుకుతూ వివాహాలను జరిపేందుకు చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల మండల కేంద్రాలతో పాటు గిరిజన గ్రామాల్లో బాల్య వివాహాలు జోరుగా సాగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ..

ఇటీవల బిచ్కుంద మండలంలో ఓ మైనర్ బాలికకు పెళ్లి చేయడానికి నిర్ణయించగా విషయం తెలుసుకున్న మండల అధికారులు ఐసీడీఎస్, పంచాయతీ సిబ్బందితో వెళ్లి ఇరువురి తల్లిదండ్రులతో మాట్లాడి ఆ పెళ్లిని నిలిపివేశారు. మైనార్టీ తీరిన తర్వాతనే పెళ్లి చేయాలని సూచించారు. గతంలోనూ గాంధారి, కామారెడ్డి మండలాల్లోనూ చిన్నారులకు పెళ్లిలు చేసేందుకు ప్రయత్నించగా అధికారులు అడ్డుకుని కౌన్సెలింగ్ నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ పెళ్లిళ్లు ఎక్కువగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మారుమూల ప్రాంతాలు కావడం ఇక్కడికి ఎవరు వస్తారులే అనే ఆలోచననో లేదంటే.. చట్టంపై అవగాహన లేకనో.. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఓ నిర్ణయానికి వచ్చి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడుతుండడంతో అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టిన కొన్నిచోట్ల వివాహాలు అడ్డుకోలేక పోతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు అప్పటికప్పుడు దొంగ సర్టిఫికెట్లు చూపేందుకు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తూ అధికారులనే బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లా ఏర్పాటుకు ముందు బాల్య వివాహాలు ఎక్కువగా జరుగగా జిల్లా ఏర్పడిన తర్వాత ప్రత్యేక మాతా శిశు సంరక్షణ కేంద్రాలు, సఖీ కేంద్రం, 1098, బాలల సంరక్షణ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో కొంత తగ్గుముఖం పట్టాయి.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట


జిల్లాలో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతీ మండలంలో అవగాహన కార్యక్రమాలు, ఐసీడీఎస్, సఖీ సిబ్బంది, డీసీపీయూ సిబ్బందితో అవగాహన కల్పిస్తూ 1098కు సమాచారం అందించాలని ప్రచారం కల్పిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమాల వల్ల బాల్య వివాహాలు జరుగుతున్న ప్రాంతాల్లోని స్థానిక అధికారులకు, కమిటీ సభ్యులకు లేదంటే టోల్‌ఫ్రీ నెంబర్‌లకు ఎవరో ఒకరు సమాచారం అందించడంతో అధికారులు వివాహం జరిగే చోటుకు వెళ్లి అడ్డుకుంటున్నారు. కాగా రెండేళ్లుగా పెద్ద మొత్తంలోనే బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఇందులో బీబీపేట, గాంధారి, నాగిరెడ్డిపేట, రాజంపేట, బిక్కనూర్, ఎల్లారెడ్డి, పిట్లం, బీర్కూర్, మద్నూర్, కామారెడ్డి, దోమకొండ, నస్రూల్లాబాద్, బిచ్కుంద మండలాలతో పాటు తదితర మండలాల్లో బాల్య వివాహాలను అడ్డుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే ఈ మండలాల్లో చాలా వరకు గ్రామీణ ప్రాంతాల్లో, తండాల్లో వివాహాలను అడ్డుకున్నారు. మైనార్టీ తీరే వరకు వివాహం చేయకుండా చర్యలు చేపట్టారు.

బాల్య వివాహ చట్టం.. నివారణ చర్యలు

ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టడానికి బాల్య వివాహ చట్టం-2006ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం బాల్య వివాహాలను ప్రోత్సహించినా లేక చేసినా శిక్షార్హులే. ఈ నేరానికి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.లక్ష వరకు జరిమానా, కొన్ని సందర్భాల్లో రెండూ విధించవచ్చు. బాల్య వివాహం చేసి మైనర్‌ను అక్రమంగా రవాణా చేయడం, దానిని దాచి ఉంచడం కూడా తీవ్రమైన నేరంగా చట్టం పరిగణిస్తోంది. ఈ చట్టం కింద నేరస్తులకు బెయిల్ లేని శిక్ష విధిస్తారు. కాగా గ్రామాల్లో బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి, స్థానిక ఉపాధ్యాయురాలు, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, వార్డు మెంబర్, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్లను నియమించింది. గ్రామాల్లో వీరు ప్రజల్లో చైతన్యం నింపుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సి ఉంటుంది.

త్వరలోనే కాంగ్రెస్ నేతలకు..
నామినేటెడ్ పదవులు!

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వివరాలను సేకరించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- పని చేసిన నేతలకు మొదట అవకాశం ఇవ్వనున్న సీఎం
- త్వరలోనే రానున్న రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు
- పార్టీలోని నేతలకు మార్కెట్ కమిటీలో అవకాశం



నిజామాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ నేతలకు త్వరలో నామినేటెడ్ పదవులు రానున్నాయి. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం కూడా నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన పీసీసీ సమావేశంలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ నేతలకు మొదట అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పని చేసిన నేతలకు సంబంధించి సమాచారాన్ని కూడా అధిష్ఠానం సేకరించింది. దానికి అనుగుణంగానే సామాజిక సమీకరణాల ప్రకారం ఈ పదవులను కేటాయించనుంది. కొంత మందికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులను కట్టబెట్టనుండగా మరికొంత మందికి జిల్లా స్థాయిలోనే నామినేటెడ్ పోస్టులను ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సంక్రాంతి దాటిన తర్వాత ఈనెల 20లోపే ఈ పదవులను ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

సీనియర్ నేతలను వరించనున్న నామినేటెడ్ పదువులు

కాంగ్రెస్‌లో దీర్ఘకాలికంగా పని చేసిన నేతలకు నామినేటెడ్ పదవులు రానున్నాయి. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి ఈ పదవులను ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో, ఏఐసీసీ స్థాయిలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే మంత్రివర్గ విస్తరణ చేసి జిల్లాకు చెందిన సీనియర్ నేత మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ పరిధిలోని జిల్లాలకు మంత్రివర్గంలో ఇప్పటి వరకు తీసుకోలేదు. మొదట ఈ మూడు జిల్లాల నుంచి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవులకు కూడా ఈ నెలలోనే భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. అంతకుముందు ఈ పదవుల భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సీనియర్ నేతలు ఏళ్ల తరబడి పార్టీలో ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా కూడా పార్టీని దాటి వెళ్లలేదు. పార్టీ కోసం కష్టపడి పని చేశారు. శాసనసభ ఎన్నికల్లో కూడా వీరిలో కొంతమంది పోటీకి సిద్ధమయ్యారు. సీట్ల సర్దుబాటులో భాగంగా సీనియర్ నేతలకు కొంత మందికి అవకాశం రాలేదు. వారందరికీ ఇప్పుడు ఈ కార్పొరేషన్ పదవుల భర్తీలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో కొంత మందికి, జిల్లా స్థాయిలో కొంత మందికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. పార్టీ నేతల సమాచారం బట్టి ఇప్పటికే జిల్లాలో ఉన్న సీనియర్ నేతలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నేతలతో ఇప్పటికే చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఢిల్లీ పెద్దల నుంచి అనుమతి రాగానే ఈ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఒకరిద్దరికి రాష్ట్రస్థాయి పదవులు

ఉమ్మడి జిల్లాలో కీలకంగా పని చేసిన ఒకరిద్దరికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లు ఇవ్వడంతో పాటు క్యాబినెట్ ర్యాంక్ కల్పించనున్నారు. మరికొంత మందికి రాష్ట్రస్థాయి పదవులను ఇవ్వనున్నారు. ఇవేకాకుండా జిల్లాలో ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీల పాలక వర్గాలు, నుడా, ఇతర నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పించి జిల్లా స్థాయి నేతలకు జిల్లాలోనే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని సామాజిక సమీకరణాలు, ఆయా కులాలకు, మతాలకు అనుగుణంగా ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది.

పార్టీ కోసం పని చేసిన వారికి మొదటి దశలో అవకాశం

పార్టీ కోసం సీనియర్‌గా పనిచేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన వారికి మొదట ఈ అవకాశం ఇవ్వనున్నారు. మిగతా నేతలకు రెండో విడతలో భర్తీ చేయనున్నారు. ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో, సీట్లలో సర్దుబాటు సమయంలో పని చేసిన వారికి మొదట ఈ అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు సంబంధించిన సీనియర్ నేతలతో సంప్రదించి ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఇతర మంత్రులతో కలిసి నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఇప్పటికే చర్చించడం, ఆయా జిల్లాల్లో నేతలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని తీసుకోవడంతో పాటు ఇప్పటికే క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం కావడంతో జిల్లాకు సంబంధించిన నేతలు కూడా పూర్తిస్థాయి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. పార్టీ సీనియర్ నేతలను కలుస్తూ అవకాశాన్ని ఇవ్వాలని కోరుతున్నారు. సంక్రాంతి తర్వాత భర్తీ చేసే ఈ నామినేటెడ్ పదవి ఎవరికి ముందుగా వస్తాయో ఈ నెలలోనే తేలే అవకాశం ఉంది.



పోచారం ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

పోచారం ప్రాజెక్టును
పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా..

- యాసంగి సాగుకు నీటిని విడుదల చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, జనవరి 4: పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరుస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆయన గురువారం యాసంగి పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేశారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు పరిధిలోని ఎల్లారెడ్డి మండలానికి చెందిన బీ జోన్‌కు పంటల సాగు కోసం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అన్ని హంగులున్నాయని, పోచారంను పర్యాటక కేంద్రంగా మార్చాలని ఈ ప్రాంతం నాయకులు, ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారని తెలిపారు. పోచారం ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా మార్చే విషయమై తాను స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి దీనిని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. పోచారం ప్రాజెక్టులో ప్రస్తుతం పుష్కలంగా నీరుందని, ప్రస్తుత యాసంగిలో ఆయకట్టులోని ఎల్లారెడ్డి మండలానికి చెందిన బీ జోన్ భూములకు సాగు నీటిని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. యాసంగి పంటల సాగు కోసం నాలుగు విడతలుగా ప్రధాన కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేస్తారన్నారు. 15 రోజులు నీటిని విడుదల చేసి అనంతరం 10 రోజులు నీటి విడుదలను నిలుపుదల చేస్తారని, ఇలా నాలుగు విడతలుగా నీటి విడుదల ఉంటుందన్నారు. నాలుగు విడతలుగా ఏప్రిల్ 10వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ఆయకట్టు చివరి గ్రామం అయినా అన్నాసాగర్ వరకు సాగు నీరందించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటారని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, రైతు నాయకుడు నర్సింహారెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ విద్యావతి, ఈఈ మల్లేష్, డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేందర్‌కుమార్, నాయకులు విఠల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బోయిని విఠల్‌గౌడ్, గయాజుద్దీన్, చిన్న లక్ష్మణ్, సామెల్ నర్సింహారెడ్డి, లక్ష్మణ్ ఠాగూర్, ఇమాం నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామారెడ్డి కాల భైరవ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం





కామారెడ్డిలో.

కాల భైరవస్వామి ఆలయంలో బహుళ అష్టమి హోమం

రామారెడ్డి, జనవరి 4: రామారెడ్డి-ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన కాలభైరవస్వామి ఆలయంలో గురువారం బహుళ అష్టమి సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం, సింధూర పూజలు నిర్వహించారు.

కామారెడ్డిలో జన్మదిన వేడుకలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని 19వ వార్డులో గల కాలభైరవ వీరాంజనేయ దేవస్థానంలో కాలభైరవస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి డోలారోహణం, హోమాలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మద్దెల వెంకటేశం, లింగం తదితరులు పాల్గొన్నారు.

అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించిన
మహనీయుడు లూయి బ్రెయిలీ : కలెక్టర్

కామారెడ్డి టౌన్, జనవరి 4: అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించి విజ్ఞానజ్యోతిని వెలిగించిన మహనీయుడు, విద్యావేత్త లూయి బ్రెయిలీ అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంధుల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివి సమాజంలో మంచి గుర్తింపును పొందాలని అన్నారు. అంధులు ఆత్మ విశ్వాసంతో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని అభిలషించారు. కళ్లు లేవని అంధులు అధైర్యపడవద్దని బ్రెయిలీ లిపి ద్వారా చదువు నేర్చుకొని ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దివ్యాంగులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇంకా కావలసిన సౌకర్యాలను కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అంధుల కోసం ఎలక్షన్ కమిషన్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై బ్రెయిలీ లిపిని రాయించినట్లు తెలిపారు. లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, జాతీయ అంధుల సంఘం అధ్యక్షుడు హరిసింగ్, భవిత కో ఆర్డినేటర్ శ్రీపతి, సుదర ఫౌండేషన్ ప్రతినిధి సుజాతారెడ్డి, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పోశవ్వ, భిక్షనాయక్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులను సన్మానిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

ప్రజా పాలనలో ప్రజలు అందిస్తున్న దరఖాస్తులను పరిశీలించి ఏ పథకం లబ్ధి కావాలో అది పూరించేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కామారెడ్డి మున్సిపాలిటీలోని 13వ వార్డులోని టెక్రియాల్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా దరఖాస్తులు అందజేయడంతో పాటు వాటిని సరిగ్గా పూరించేలా అవగాహన కలిగించాలని అన్నారు. ప్రజలు కూడా ఎక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లలోని సిబ్బంది సహకారంతో దరఖాస్తులను నింపి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జతపరిచి సమర్పించాలన్నారు. గ్రామ సభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్రమపద్ధతిలో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి తప్పులు లేకుండా రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేసుకొని నిర్ధారిత సమయంలోగా డేటా నమోదు చేయాలని సూచించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఈవో

నసురుల్లాబాద్, జనవరి 4 : 2024 సంవత్సర పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను గురువారం నసురుల్లాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్‌రావు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు హన్మాండ్లు మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందు ఉంటుందని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చందర్, రాష్ట్ర బాధ్యులు వెంకాగౌడ్, హన్మాండ్లు యాదవ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భూషణ్, మండల బాధ్యులు సంజీవులు, సుజాత, శ్రీచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నసురుల్లాబాద్‌లో పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యల వలయంలో ఏర్గట్ల పీహెచ్‌సీ

● పూర్తి స్థాయిలో సిబ్బంది లేని వైనం ● మౌలిక వసతులు కరువు ● నిరుపయోగంగా మూలన పడ్డ పరికరాలు


ఏర్గట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న పరికరాలు

ఏర్గట్ల, జనవరి 4: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఆదేశించినా అది క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఏర్గట్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను నిర్మించి ఏళ్ళు గడుస్తున్నా ఇంత వరకు వైద్య సిబ్బందిని కేటాయించలేదు. సరియైన వసతులు లేక అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రిలో చికిత్స కోసం, వైద్యుల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు, వస్తువులు పనికి రాకుండా తుప్పు పడిపోతున్నాయి. పిహెచ్‌సీలో కేవలం ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇన్‌చార్జి అటెండర్‌తో నెట్టుకొస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ అందుబాటులో ఉండటంతో రోజుకు 30 మంది సాదారణ ఓపీలు చేస్తున్నారు. పిహెచ్‌సీకిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో చికిత్సల కోసం వచ్చే రోగులకు ఆ ఇద్దరే వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. పిహెచ్‌సీలో ప్రధానంగా మౌళిక వసతులైన విద్యుత్, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని తెలుపతున్నారు. 3 ఫేజ్ కరెంట్ లేకపోవడంతో పాము కాటు, కుక్కకాటుకు మెడిసిన్ ఫ్రిజ్‌లో నిలువ చేయలేకపోతున్నారు. దీంతో మండల పరిధి గ్రామాలైన బట్టాపూర్, తొర్తి, తాళ్ళరాంపూర్, దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్‌లో ఉండే ప్రజలకు వైద్య అందక నానా అవస్థలు పడుతున్నారు. అంతే కాక ప్రసావాల కోసం, కుటుంబ నియంత్రణ వంటి ఆపరేషన్‌లకు దూర పాంత్రాలకు వెళ్ళి ప్రైవేట్ ఆసుప్రతులకు వెళుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని కేటాయిస్తే మండలంలోని గ్రామాలే కాకుండా ఇతర మండలాలకు చెందిన ప్రజలు కూడా వైద్య సేవలు పొందవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్యం కేంద్రంలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా వైద్యాధికారిని సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

బీర్కూర్, జనవరి 4 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అంబయ్య అనే యువకుడు గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా మృతుడు అంబయ్య క్లాస్‌మేట్స్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 28 వేల 500ల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అంబయ్య 2004లో పదో తరగతి చదివాడు. అంబయ్య క్లాస్‌మేట్స్ కుటుంబాన్ని పరామర్శించడం, ఆర్థిక సహాయం చేయడం హర్షణీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ

మద్నూర్, జనవరి 4 : మండలంలోని లచ్చన్, అంతాపూర్, తదితర గ్రామాలలో, డోంగ్లీ మండలంలోని కుర్ల గ్రామంలో లబ్ధిదారుల నుంచి అభయ హస్తం దరఖాస్తులు స్వీకరించారు. 3 గ్రామాలలో 1143 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రెడ్‌క్రాస్ 10 వేల ఆర్థిక సహాయం

పిట్లం జనవరి 4 : మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మి బాధితురాలికి గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవ్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసహాయం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌రాష్ట్ర సభ్యులు మాట్లాడుతూ చిన్నకొడప్‌గల్ గ్రామంలో గత రెండు రోసుల క్రితం వడ్ల లక్ష్మి నివాసపు ఇల్లు విద్యుత్‌షాక్‌తో పూర్తి కాలిపోయినది, ఇంట్లో వస్తువులు పూర్తి కాలిపోవడంతో తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం, వంటసామాగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అధ్యక్షులు బుడాల నవీన్, వేణుగోపాల్, బోడ్లరాజు, విండో చైర్మెన్ నారాయణరెడ్డి, పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో 905 దరఖాస్తుల స్వీకరణ


ముత్యంపేటలో దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, జనవరి 4 : మండలంలోని ముత్యంపేట గ్రామంలో గురువారం నాటికి 905 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం గ్రామంలో 1437 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు అందజేయాలని జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ తిరుపతిగౌడ్, అశబోయిన శ్రీనివాస్,రవి, సంజీవ్, మధు, శ్రీహరి సీతారాం మధు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో పోలీసుల తనిఖీలు


ఎల్పుగొండ చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

దోమకొండ, జనవరి 4 : మండల కేంద్రంలోని ఎల్పుగొండ చౌరస్తా వద్ద గురువారం ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పకుండ పాటించాలన్నారు. కార్యక్రమంలో పీసీలు సామ్రాట్, చంద్రకాంత్ ఉన్నారు.

బాల్కొండ కళాశాలలో సావిత్రీబాయి ఫూలే జయంతి


బాల్కొండ కళాశాలలో క్రీడాకారులతో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్

ముప్కాల్, జనవరి 4 : స్త్రీ అభ్యుదయవాది, సంఘ సంస్కర్త సావిత్రి బాయి ఫూలే 192వజయంతి వేడుకలను గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్ పాల్గొన్నారు. అనంతరం సావిత్రిబాయిఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రస్థాయి బీచ్‌వాలీబాల్ పోటీలో గోల్డ్‌మెడల్ సాధించిన అకాష్, విజ్ఞాన్‌రాజ్‌లను ముగ్గురు క్రీడాకారులను జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి రఘురాజ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరణ

ముప్కాల్, జనవరి 4 : ఆరు గ్యారంటి దరఖాస్తుల స్వీకరణల నేపథ్యంలో ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతుంది. గురువారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

సీఎంవో కార్యదర్శిని కలిసిన ట్రేసా


సీఎంవో కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమన్‌రెడ్డి, తదితరులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 4 : సీఎంవో కార్యదర్శిగా నియమితులైన జిల్లాకు చెందిన సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ట్రేసా తరఫున మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రేసా జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గౌతంకుమార్, తదితరులు చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు నగరంలో

ప్రజాపాలన కేంద్రాలను సందర్శించనున్న షబ్బీర్‌అలీ

నిజామాబాద్ అర్బన్, జనవరి 4 : ప్రభుత్వం ప్రజల నుంచి వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన పేరుతో స్వీకరిస్తున్న దరఖాస్తుల కేంద్రాలను శుక్రవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సందర్శించనున్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాలను ఆయన పరిశీలించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్మూర్ డిపో మేనేజర్‌కు

ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతం


డిపో మేనేజర్ ఆంజనేయులుకు మెమోంటో అందజేస్తున్న దృశ్యం

పెర్కిట్, జనవరి 4 : ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నియమితులైన ఆంజనేయులుకు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువ, మెమోంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ అధ్యక్షుడు రవి, సభ్యులు గోపి, నర్సయ్య, జనార్థన్, రాములు, గంగవ్వ, లక్ష్మీ, త్రివ్రణి, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన

ఎరువులను అందుబాటులో ఉంచాలి


బాల్కొండలో తనిఖీ చేస్తున్న అధికారులు

ముప్కాల్, జనవరి4: బాల్కొండ మండలంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలను రైతులకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య ఆదేశించారు. గురువారం బాల్కొండ మండలంలోని సొసైటీలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు రైతులకు ఎరువుల అమ్మకాలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదులను ఇవ్వాలని ఆదేశించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన మేర ఎరువులను ఇవ్వాలని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎరువుల నిల్వల నివేదికను ప్రతీ రోజు వ్యవసాయాధికారి సమర్పించాలని తెలిపారు. యాసంగి సీజన్‌లో ఎక్కడ కూడా ఎరువుల కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేంధర్, ఏఈవోలు, దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

శివసాయి మందిరంలో సప్తహ పారాయణం

ముప్కాల్, జనవరి4: ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద శివసాయి మందిరంలో గురువారం 108మంది సప్తహ పారాయణం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై సాయి పారాయణాన్ని చేపట్టారు. వారం రోజుల పాటు జరిగే సాయి పారాయణంలో ప్రజలు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీపోత్సవం, 108రకాలతో స్వామివారికి నైవేద్యం, పల్లకిసేవ, శోభయాత్ర, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు అంజయ్య, దయానంద్, ఎన్.రాజు, సోమన్‌నాథ్, పృథ్వీవల్లబ్, సాయిరాజ్, సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం

భిక్కనూరు, జనవరి 4: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలోని ర్యాగట్లపల్లి, రామేశ్వర్‌పల్లి, బాగిర్తిపల్లి, ఇసన్నపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ దరఖాస్తులను అధికారులకు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సర్పంచ్



గోప్యనాయక్ తండా సర్పంచ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ, జనవరి 4: సిరికొండ మండలంలోని గోప్యనాయక్ తండా గ్రామ సర్పంచ్ శంకర్‌లాల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ పార్టీకి చెందిన శంకర్ లాల్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. శంకర్‌లాల్‌తో పాటు వర్ష్యన్‌తండా, గోప్యనాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామా అభివృద్ధి కమిటీ, పాలక వర్గ సభ్యులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. వారి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్‌నాయక్,మోజ్యానాయక్ తదితరులు ఉన్నారు.

రాజ్య పురస్కార్ అవార్డు రావడం అభినందనీయం



స్కౌట్స్ విద్యార్థులకు మెమొంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ జనవరి 4: సిరికొండ విద్యార్థులు గవర్నర్ ద్వారా రాజ్యపురస్కార్ అవార్డును పొందడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సిరికొండ కు చెందిన సత్యాశోధక్ పాఠశాలకు చెందిన స్కౌట్స్ మరియు గైడ్స్ లో రాణించి గవర్నర్ రాజ్య పురస్కార్ అవార్డును సాధించడం శుభపరిణామమని ఎమ్మెల్యే అన్నారు. రాజ్య పురస్కార్ పొందిన యశ్వంత్,నీరజ్ రాథోడ్‌లకు ఎమ్మెల్యే ప్రశంస పత్రాలను అందజేశారు. వారికి జ్ఞాపికలను కూడ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయ చైర్మన్‌ను మార్చాలని మంత్రికి ఫిర్యాదు

డిచ్‌పల్లి, జనవరి 4: ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం ఛైర్మన్‌గా ఉన్న మహేందర్‌రెడ్డిని తొలగించాలని డిచ్‌పల్లి గ్రామ ప్రజాప్రతినిధులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గత పదేళ్లుగా మహేందర్‌రెడ్డి రామాలయ కమిటీ ఛైర్మన్ కొనసాగుతూ లక్షలాది రూపాయల ఆదాయం కొల్లగొడుతున్నారని రామాలయ అభివృద్ధి కి నూతన పాలక వర్గం ఎన్నుకోవాలన్నారు. గ్రామస్థుల కోరికను త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు పేర్కొన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

ధర్పల్లి, జనవరి 4: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరుకానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ గురువారం తెలిపారు. ఉదయం 11గంటలకు గ్రామంలోగల గురడిరెడ్డి కళ్యాణ మండపంలో జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి గ్రామ శాఖ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన భూపతిరెడ్డి మొదటిసారిగా మండలానికి వ చ్చేస్తున్న సందర్భంగా ఘనస్వాగత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామంలో జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి సైతం ఎమ్మెల్యే హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

10 వరకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం

నిజామాబాద్ అర్బన్, జనవరి 4: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు రూ.500ల అపరాధ రుసుముతో ఈనెల 10 వరకు అవకాశం ఉన్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు రూ.500ల అపరాధ రుసుముతో ఈనెల 23 వరకు అవకాశం ఉందని ఆమె తెలిపారు. పీజీ రెండవ సంవత్సరం పరీక్షలు ఈనెల 17 నుంచి 21 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు, పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 27 నుంచి 31 వరకు, యూజీ మూడవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు, యూజీ ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 7382929612 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు సిరికొండ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ జనవరి 4 :సిరికొండ మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, సిరికొండ గ్రామాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి శుక్రవారం పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి తెలిపారు. మొదట తాటిపల్లి గ్రామంలో ఉదయం పది గంటలకు ఆంజనేయ స్వామిని దర్శించుకుని అక్కడే ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొంటారని ఆయన తెలిపారు. చీమన్‌పల్లి గ్రామంలో జరిగే సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే శ్రీలొంక రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సిరికొండలో జరిగే ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని రవి తెలిపారు.ఎమ్మెల్యే పర్యటన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యాలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడు.

కమ్మర్‌పల్లిలో అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

కమ్మర్‌పల్లి, జనవరి 4: కమ్మర్‌పల్లి మండకేంద్రంలో గురువారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. గతమూడు రోజులుగా ఈ పంపిణీ కొనసాగుతోన్నది. కాగా గురువారం గ్రామంలోని భూలక్ష్మీ కాలనీలో పంపిణీ చేశారు. గ్రామంలో మరో మూడు రోజులపాటు అక్షింతల పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నల్ల గణేష్ గుప్తా, ఆమెడ నరేందర్, ప్రభాకర్, రమేష్, గంగాధర్, నాగభూషణం,నరేష్ పాల్గొన్నారు.

పాల్దాలో వికసిత్ భారత్ కార్యక్రమం

నిజామాబాద్ రూరల్, జనవరి 4: రూరల్ మండలం పాల్దా గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. గురువారం పాల్ద గ్రామంలోని జీపీలో కేంద్ర బృందం పర్యటించింది. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామస్థులు కేంద్రం అమలు పరుస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలు ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా స్థానిక అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రబృందం కమల్ అరోరా, ఆదిత్య లోహియా, ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ, స్థానిక సర్పంచ్, కార్యదర్శి ధీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పాల్దవాసులు, అధికారులు

ఉద్యమకారులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలి

బోధన్ రూరల్, జనవరి 4: తెలంగాణ ఉద్యమకారుల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను స్వాగతిస్తున్నామని బోధన్ జేఏసీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ బోధన్‌లో 1519 రోజుల పాటు తెలంగాణ ఉద్యమం కోసం దీక్షలు కొనసాగించిన స్థలంలో ఫైలాన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులందరికీ 250 గజాల ఇండ్ల స్థలాన్ని కేటాయించాలని, ఉద్యమకారుల కోసం సంక్షేమ నిధులు ఏర్పాటు చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమకారులను గుర్తించలేదని, ఉద్యమాన్ని, ఉద్యమకారులను గుర్తిస్తే కేసీఆర్‌కు గుర్తింపు తగ్గుతుందని దురుద్దేశంతో తెలంగాణ రాష్ట్రం కోసం సబ్బండ వర్గాల ప్రజలు చేసిన ఉద్యమాన్ని గుర్తించక పోవడమేగాక ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ కోదండ రామ్ ఇంటి తలుపులను బద్దలగొట్టి అరెస్టులు చేశారని పేర్కొ న్నారు. ధర్నాచౌక్‌ను ఎత్తివేసి తెలంగాణలోని ప్రజలు ఏది ప్రశ్నించినా సహించ లేక అణచివేతలతో పాలన సాగించారని, తెలం గాణ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని, అందుకే తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుని బీఆర్ఎస్‌ను ఓడించారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి మల్లేష్, స్టీరింగ్ కమిటీ నాయకులు జి.శివరాజ్‌లతో మహేం దర్‌రెడ్డి, కె.శంకర్, పడాల శంకర్, పల్నాటి యాదగిరి, ముత్తెన్న, భాగ్య రాజ్, యూనుస్, షేక్ పాషా, మాధవరావు, సాయిలు తదితరులు ఉన్నారు.



బోధన్‌లో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నూతన సమాజ నిర్మాణంలో టీచర్లు భాగస్వాములు కావాలి

బోధన్‌రూరల్, జనవరి 4:ఉపాధ్యాయులు నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు.గురువారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, కావున ఉపాధ్యాయు లు నూతన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ బోధన్ డివిజన్ ఇన్‌చార్జి శంకర్, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, గంగాధర్, పోతంగల్ అధ్యక్షులు వెంకటేష్, రుద్రూరు ప్రధాన కార్యదర్శి సుధీర్, రాష్ట్ర బాధ్యులు సంజీవ్‌కుమార్, మండల బాధ్యులు వాసవి, అయ్యూబ్, అభ్యందర్, బాలాజీ, శివకుమారి, వీరాజీ, గోవర్ధన్, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

రెంజల్: రెంజల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ సభ్యురాలు విజయ సంతోష్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పాటుపడే పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ కుమార్, ఎంపీడీవో శంకర్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంఈవో రామారావు, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్ సింగ్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, అబ్బయ్య, కిషోర్, గోవర్ధన్, గంగాదర్, తాహెర్, శ్రీనివాస్, సతీష్ వ్యాస్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ ఆర్డీవో రాజాగౌడ్

కోటగిరి రైస్‌మిల్లుల్లో విస్తృత తనిఖీలు

కోటగిరి,జనవరి4: కోటగిరి మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో సీఎంఆర్ ధాన్యంపై గురువారం డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎక్లాస్‌పూర్‌కు చెందిన వీఎంకే, ఏకే ఇండస్ట్రీస్ మిల్లుల నుండి రెండు రోజుల క్రితం రెండు లారీల్లో సీఎంఆర్ ధాన్యం అక్రమంగా తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను ఇతర రైస్‌మిల్లులో సీజ్ చేసి పెట్టారు. రెండు రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. 738క్వింటాళ్ల ధాన్యం స్వాధీనం చేసుకున్న అధికారులు రైస్ మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించి అక్రమాలను వెలికి తీసే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు కేటాయించిన ధాన్యంలో బియ్యం ఎంత మేరకు ప్రభుత్వానికి ఇచ్చారో గుర్తించి మిగిలిన మొత్తానికి సంబంధించి ధాన్యం నిల్వల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడిన రైస్‌మిల్లులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు సీఎంఆర్ ధాన్యం కేటాయించకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంది.



కోటగిరిలోని రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేయాలి

డిచ్‌పల్లి, జనవరి 4: అసమానతలు లేని సమాజం కోసం సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో పోరాటం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్ అన్నారు. గురువారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా పీడీఎస్‌యూ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాలుర వసతి గృహంలో పూలే జయంతి నిర్వహించారు.ఈసందర్భంగా సావిత్రి పూలేకు పూలదండ వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం గణేశ్ మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే దేశంలో మొట్టమొదటి సారిగా మహిళలకు అట్ట డగు వర్గాల వారికి చదువు నేర్పించిందని, పితృసామ్య వ్యవస్థకు వ్యతి రేకంగా వితంతు వివాహాలను వ్యతిరేకంగా కుల నిర్మూలన పోరాటాలు నిర్వహించిందని అన్నారు. సావిత్రీబాయిపూలే స్ఫూర్తితో విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజం కోసం యూనివర్సిటీ సమస్యలపై సావిత్రీబాయిపూలే స్ఫూర్తితో పోరాడలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుందర్ సింగ్, బబ్లూ, శివా, రాజేశ్వర్,సాకేత్,అనిల్,నిఖిల్, రంజిత్, శ్రీరాం,శివా, సందీప్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నగర మేయర్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 4: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను గురువారం నగరంలోని బైపాస్ రోడ్‌లోగల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ జిల్లా అంధుల వనరుల కేంద్రంలో మహిళా శిశుసంక్షేమ, వయోవృద్ధుల శాఖ, స్నేహసొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ అంధ ఉద్యోగుల సంఘం, అంధ నిరుద్యోగ సంఘం సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ నీతూకిరణ్ హాజరై లూయిస్ బ్రెయిలీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే విషయం అందరికి తెలుసని శరరీంలో ఏ అవయవం తక్కువగా ఉన్నా నెట్టుకురావచ్చు కానీ దృష్టి లోపం ఉన్నట్లయితే జీవితాన్ని నడపడం కష్టమవుతుందని ఆమె అన్నారు. సృష్టిలో దేవుడు చాలా అందమైన వాటిని సృష్టించాడని మనిషి అందమైన వస్తువులను చూసినప్పుడు కలిగే ఆనందాన్ని కళ్లులేని వారు పొందలేకపోవడం నరకమన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంధులకు సేవలందజేస్తున్న ఉద్యోగులను, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న అంధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ, మెప్మాపీడీ రాజేందర్, స్నేహసొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, సాగర్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కుట్రలతోనే బీఆర్ఎస్ ఓటమి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్ రావు

నవీపేట,జనవరి4: ఇటీవల జరిగిన రాష్ట్ర శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల కుట్రలతోనే బీఆర్ఎస్ ఓటమి పాలైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంకిషన్ రావు అన్నారు. శాసన సభ ఎన్నికల అనంతరం మొదటి సారిగా గురువారం మండల కేంద్రంలోని దాస్ గెస్ట్‌హౌస్‌లో మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ఓటమి రేపటి గెలుపుకు నాంది కావాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆయన ఆరోపించారు. రాబోయే రోజులలో సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు కూడా ఉన్నందున కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు కోట్లాది రూపాయలను ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. అనంతరం పార్టీ ఓటమికి గల కారణాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నర్సింగ రావు, భవంతి దేవిదాస్, సాయిబాబా గౌడ్, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, నవీపేట సొసైటీ ఛైర్మన్ అబ్బన్న, వైస్ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్; తెడ్డు పోశెట్టి, బుచ్చన్న, కిషోర్ రావు, మల్లేష్, బినోల సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రాంకిషన్ రావు

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ప్రతినిధులు గురువారం రాష్ట్రఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని, జీవో 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పదోన్నతులలో టెట్ మినహాయింపు ఇవ్వాలని లేదా ఆరు సంవత్సరాల్లో పాసయ్యే అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా,జనవరి4: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన పాటలు ఆలపించారు. పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పంతులు నరేందర్, ఆలయ ధర్మకర్త పుష్పలత రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

డిచ్‌పల్లి, జనవరి 4: డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘ అధ్యక్షుడు గజవాడ జైపాల్‌పై కార్యవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టి డీసీవో సింహచలానికి అవిశ్వాస నోటీస్ అందజేశారు. 1964 చట్టం ప్రకారం సభ్యులు పెట్టిన తీర్మానం మేరకు జనవరి 23 ఉదయం 11గంటలకు అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిపి ఓటింగ్ నిర్వహించను న్నామని డీసీవో సింహచలం ఒక ప్రకటన జారీ చేశారు. అవిశ్వాసం పెట్టిన వారిలో డైరెక్టర్ చిన్న నర్సింహులు, చిన్న గంగారం, బాలమల్లు, దాసరి రమేష్, రాంచందర్ గౌడ్, అంకం లత, రాజవ్వ, సాయమ్మ, హరిచంద్, గంగారెడ్డి, సతీశ్‌రెడ్డి, శాంసన్, తదితరులు ఉన్నారు. సహకార సంఘంలో జరిగిన అవినీతి తోనే ఈ అవిశ్వాస తీర్మాణం ప్రవేశ పెట్టినట్లు సభ్యులు పేర్కొన్నారు.

ప్రజలు భయపడకుండా పరీక్షలు చేసుకోవాలి

● హెచ్ఐవీపై కళాజాత



బోధన్‌లో హెచ్ఐవీపై కళాజాతా దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 4: ప్రజలు భయపడకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ రాజన్న అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంగణంలో హెచ్ఐవీపై కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు చెడు మార్గాల వైపు వెళ్లవద్దన్నారు హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ సభ్యులు సావిత్రి, సంపూర్ణ సురక్ష కేంద్రం స్రవంతి, జనంపాట డప్పు కళాకారులు సంతోష్, గోపాల్‌లతో తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లిలో కాంప్లెక్స్ సమావేశం



విద్యార్థులకు బోధిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి, జనవరి 4: మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంప్లెక్స్ పరిదిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హాజరుకాగా వారివారి పాఠశాలల్లో ఎఫ్ఎల్ నిర్వహణ పద్ధతులను, లైబ్రేరి నిర్వహణ పద్ధతులను కాంప్లెక్స్ హెచ్ఎం ఎంఈవో ఆంధ్రయ్య, మండలనోడల్ అధికారి కనక గంగాధర్ జిల్లా సీసీటీ వెంకటేశ్వరులు, కిషన్ ఉన్నతి లక్ష్మీనాథం ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల విద్యాబోధన పద్ధతులను పర్యవేక్షించారు. వివిధ పాఠ్యశాల నిర్వహణ విధానాలను వివరించారు సమావేశంలో కాంప్లెక్స్ కార్యదర్శినరేందర్ కాంప్లెక్స్ పరిదిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అండర్-14 రగ్బీ ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 4: జిల్లాస్థాయి అండర్-14 రగ్బీ ఎంపికలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, అబ్బయ్యలు తెలిపారు. మోపాల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 9గంటలకు మైదానానికి చేరుకోవాలని తెలిపారు.

మోడల్ స్కూల్‌కి బస్సు సౌకర్యం కల్పించాలి

వర్ని,జనవరి4: వర్ని ఉమ్మడి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మోడల్ స్కూల్, కాలేజ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ వర్ని కళాశాలల అధ్యక్షురాలు సీత డిమాండ్ చేశారు. గురువారం వర్ని మండల కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 800మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నారని ఉదయం, సాయంత్రం విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అధికారులు చొరవ తీసుకుని ఆర్టీసీ బస్సును నడపాలని లేకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న, జైన, సరోజ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

భిక్కనూరు, జనవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని భిక్కనూరు ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ నాయకులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తీసుకువచ్చి భోజనం చేస్తున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజన సమస్యలను వెంటనే మండల విద్యాధికారి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని లేని యెడల ఎంఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివకృష్ణ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్

మంత్రి పొన్నంను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, జనవరి 4: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తోట లక్ష్మీకాంత్‌రావ్ మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేగాక మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ఆటోలతో పాటు ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకురాగా. స్పందించిన మంత్రి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో పాటుగానే జుక్కల్ నియొజక వర్గం కర్నాటక, మహారాష్ట్రలకు ఆనుకుని ఉన్నందున ఆ రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి నిషేధిత వస్తువులు రాకుండా, అక్రమ రవాణా జరగకుండా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.



జుక్కల్ బస్టాండ్‌లో సౌకర్యాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జుక్కల్ బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం

పెద్ద కొడప్‌గల్, జనవరి 4: జుక్కల్ బస్టాండ్‌లో రానున్న రోజుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని జుక్కల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పెద్ద ఏడ్గి సర్పంచ్ వినోద్ తెలిపారు. గురువారం కాంగ్రెస్ నాయకులతో కలసి బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో జుక్కల్ బస్టాండ్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బస్టాండ్‌లో ముళ్లపొదలు పెరిగిపోయాయని, బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులతో పాటు, హైదరాబాద్ ప్రాంతం నుంచి బస్సులో వచ్చిన మహిళా కండక్టర్లు కనీస అవసరాలు తీర్చుకోకుండా ఈ బస్టాండ్ తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న 15 రోజుల్లో జుక్కల్ ఎమ్మెల్యే సహకారంతో బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పిస్తావని తెలిపారు. అందులో భాగంగానే గురువారం బస్టాండ్ ఆవరణలో గల ముళ్ల పొదలను తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుల్ల సహకార సంఘం డైరెక్టర్ విఠల్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ లక్ష్మణ్ పటేల్, మాజీ ఎంపీటీసీ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



సలాబాత్‌పూర్‌లో కల్తీ కల్లు పారబోస్తున్న పోలీసులు

మద్నూర్, జనవరి 4: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం మద్నూర్ మండలం సలాబత్‌పూర్ చెక్ పోస్టు వద్ద మహారాష్ట్ర నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎక్సైజ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీఐతో పాటు ఎస్సై అభిషేక్‌లు తనిఖీలు చేశారు. అలాగే పలు కల్లు దుకాణాల్లో తనిఖీలు చేశారు. రహదారుల్లో వాహనాలను తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో అక్రమ లిక్కర్, డ్రగ్స్ రాకుండా చూస్తున్నామన్నారు. పెద్ద శక్కర్గ, మద్నూర్, మేనూర్ గ్రామాల్లోని కల్లు దుకాణాలను పరిశీలించారు. నమూనాలను సేకరించి, పరీక్ష నిమిత్తం జిల్లాకు పంపించామన్నారు. కల్తీ కల్లు విక్రయదారుడిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో ఎక్కడ కల్తీ కల్లు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడినా, కలిగి ఉన్నా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎల్లయ్య, పెంటయ్య, నవీన్‌రెడ్డి, శ్రీధర్, పరుశురాం, అనిత, ప్రేమలత, స్వరూప తదితరులున్నారు.

గ్యారెంటీల అమలు కోసమే ప్రజాపాలన

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, జనవరి4: సంక్షేమ పథకాలను పేద ప్రజలందరికీ అందజేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆయన గురువారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంతోపాటు, బెజగం చెరువు తండాలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమాల్లో పాలొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదోళ్ళకు న్యాయం జరగలేదని, రేషన్‌కార్డులు కావాలని, ఇండ్లు కావాలని నిరుపేదలు ఎంత మొరపెట్టుకున్నా ఆ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం తమ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు న్యాయం జరిగేలా అహర్నిశలు పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు సునీతా వెంకట్‌రెడ్డి, మంగ్లీ, ఎంపీటీసీ మాధవి, కో ఆప్షన్ మెంబర్ షాహెద్ పాషా, ఆర్డీవో ప్రభాకర్, మండల ప్రత్యేక అధికారి రఘునందన్‌రావు, తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఏవో విజయ్ శేఖర్, మండల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

● సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

నసురుల్లాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాల్లో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల కొరకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు కోరారు. గురువారం నసురుల్లాబాద్ మండలంలోని నెమలి, రాములగుట్ట తండా గ్రామాలలో ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ హన్మాండ్లు, పంచాయితీ కార్యదర్శి మానస, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము సాయాగౌడ్, శివప్రసాద్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తాం..

బీర్కూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయ హస్తం ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్, చించోల్లి గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జనార్థన్, ఎంపీడీవో భానుప్రకాష్‌లు కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామ సభలు నిర్వహించారు. ప్రజా పాలన కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్థన్, ఎంపీడీవో భానుప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిని శంకర్, సొసైటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, నాయకులు బస్వరాజ్, ఎక్బాల్, గంగాధర్, పుల్లేని పేరయ్య, రఫీ, రామారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను పరిశీలించిన అదనపు కలెక్టర్

సదాశివనగర్, జనవరి 4: మండలంలోని ఉత్త నూర్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం అదనపుక లెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ప్రజలు అంద జేస్తున్న దరఖాస్తు ఫారాన్ని పరిశీలించారు. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత రశీదును అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్ధార్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఘనంగా 'అయోధ్య' అక్షింతల శోభాయాత్ర

నాగిరెడ్డిపేట, జనవరి4: మండలకేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్యలో పూజిత అక్షింతల మహా శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో పూజించిన అక్షింతలను గ్రామంలోని ప్రధాన వీధులగుండా శోభయాత్రను స్థానికభక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజిత అక్షింతలను గ్రామంలోని ఇంటింటికి పంపిణీ చేస్తామ న్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి, జనవరి 4: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయం లో అన్నసాగర్ సర్పంచ్ నాగరాజు అయోధ్య పూజిత అక్షింతలను గురువారం స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నసాగర్ గ్రామంలో అక్షింతలతో శోభాయాత్రను నిర్వహించి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉంచారు.ఈ శోభాయాత్రలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ క్యాలెండర్ ఆవిష్కరణ

బాన్స్‌వాడ, జనవరి4: బాన్స్‌వాడ ఉన్నత ప్రభుత్వం పాఠశాలలో గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మండల విద్యాధికారి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాటాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యల సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు

బీర్కూర్, జనవరి4: అంధుల జీవితాల్లో లూయీ బ్రెయిలీ వెలుగులు నింపిన బ్రెయిలీ జయంతిని ఆయా మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బరంగేడ్గి గ్రామానికి చెందిన గైని సంతోష్ అనే అంధ ఉపాధ్యాయుడిని ఉపాధ్యాయులు విద్యార్థు లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ ఎం సంతోష్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, నాగ రాజు, వేణుగోపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● గాంధారిలో..

గాంధారి: మండలకేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో మండల విద్యాధికారి సేవ్‌ల అధ్యక్షతన లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పించారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా మండల అభివృద్ధి అధికారి సతీష్ మాట్లాడారు. అంధులైన పిల్లల జీవితాల్లో వెలుగు నింపిన, మహనీయుడు లూయిస్ బ్రెయిలీ కొనియాడారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఏవో

కామారెడ్డిటౌన్, జనవరి4: మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్ వద్ద విత్తనాలు ఎరువులు పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రజాపతి తనిఖీ చేశారు. పురుగు మందులు, ఎరువులు విత్తనాల దుకాణాలలో ముద్రించిన ధరల ప్రకారమే విక్రయించి రైతులకు రశీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించి స్టాక్‌బోర్డ్‌పై నిల్వలను ఏరోజుకు ఆరోజు సూచించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు అందించిన సలహాలు, సూచనలు మేరకు మాత్రమే విత్తనాలు పురుగుమందులను అందజేయాలని తెలిపారు.

ఆంజనేయ స్వామి హుండీ లెక్కింపు

మద్నూర్, జనవరి 4: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో గల సలాబత్ పూర్ ఆంజనేయ స్వామి హుండీని గురువారం లెక్కించారు. ప్రతీ మూడు నెలలకు ఒక్కసారి ఆలయ హుండీ లెక్కిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. రూ.1,80,360 వచ్చినట్లు అధికారులు తెలిపారు.



సలాబాత్‌పూర్ ఆలయంలో హుండీని లెక్కిస్తున్న సిబ్బంది



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కామారెడ్డి టౌన్, జనవరి 4: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాలపై సైబర్ సెల్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. సైబర్‌నేరాల పట్ల బాధితులు టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు చేసే పెట్టుబడి మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లావాదేవీల మోసాలు, మోసపూరిత ఫోన్‌కాల్స్ సందేహాలను నమ్మవద్దని, లోన్ అప్లికేషన్ ఎవరు కూడా డౌన్‌లోడ్ చేసుకోవద్దని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు గాని, బహుమతులు గాని, ఉద్యోగాలు గాని ఎవరూ కూడా ఇవ్వరనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకొని ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవునిపల్లి పోలీసుస్టేషన్ సిబ్బంది, కళా బృందం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా సంస్థానాల వారి సేవా సదస్సు

దోమకొండ, జనవరి 4: మండల కేంద్రంలోని గడి కోటలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు తెలంగాణా సంస్థానాల వారి సేవా సదస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గడికోట మేనేజర్ బాబ్జి గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి తెలుగు సాహితీ అభ్యున్నతికి సేవలు అందించిన, అందిస్తున్న పండితులు హాజరవుతారన్నారు. తెలంగాణలోని ఇతర 14 సంస్థానాలు కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కోట వారసులు కామినేని శోభన, అనిల్‌కుమార్, పలువురు సినీ నటులు, ప్రముఖులు వస్తున్నట్లు తెలిపారు. కోటలో ఉదయం దోమకొండ చిన్నారులచే శిక్షకురాలు హిమబింధు ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్ రాష్ట్ర ఫీల్డ్ ఆఫీసర్‌గా రేపని భాస్కర్

నిజాంసాగర్, జనవరి 4: గురుకులాల స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్ రాష్ట్ర ఫీల్డ్ ఆఫీసర్‌గా రేపని భాస్కర్‌ను నియమిస్తూ గురుకుల రాష్ట్ర కార్యదర్శి నవీన్ నీకోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంసాగర్ మండలంలో పనిచేస్తున్న రేపని భాస్కర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.